ఇప్పటికీ వీరేష్ పత్రికల్లో "ఔత్సాహిక కమెడియన్లకి మీరిచ్చే సలహా ఏమిటి?" అనే ప్రశ్నకి సమాధానంగా "కమెడియన్ కాక ముందే పెళ్లి చేసుకోండి. లేదా జీవితంలో ఓ గొప్ప అనుభవాన్ని మిస్ అవుతారు" అని చెప్తుంటాడు.

ఎందుకంటే...

చిన్నప్పటి నుంచీ వీరేష్ ధ్యేయం ఒకటే. చాలా మందిలా ఇంజనీరింగ్ కోర్సు పాస్ అయి అమెరికా వెళ్లాలనీ, కార్పెంటరీ వర్క్ నేర్చుకుని గల్ఫ్‌కి వెళ్ళాలనీ కాదు.

# నవ్వవద్దు డియర్!



మల్లాది వెంకటకృష్ణమూర్తి

హాస్యనటుడు అవ్వాలని.

మాయాబజార్‌లో అల్లు, వంగరలను చూసినప్పుడు కలిగిందా కోరిక. మిస్సమ్మలో రేలంగిని చూశాక [రీ రన్ షోలో] బలవడింది. మంచి మనిషిలో పద్మనాభాన్ని చూశాక అది ధ్యేయంగా మారింది. రాజ్‌బాబు, కె.వి. చలం, పొట్టిప్రసాద్, వీరభద్రరావు, వేలు, రాళ్ళపల్లి, నూతన్‌ప్రసాద్, బ్రహ్మానందం, కోట శ్రీనివాసరావు లాంటి అనేకమందిని వెండి తెరమీద చూశాక తన కెరీర్ కమెడియన్ అవడమే అనుకుని ప్రయత్నాలు ప్రారంభించాడు.

వీరభద్రరావు బతికుండగానే చెప్పాడు. కమెడియన్‌గా చిత్రాల్లోకి ఎంటర్ అవడం ఎంత కష్టమో. ఏదో సందర్భంలో బ్రహ్మానందమూ చెప్పాడు ఎంటర్ అయ్యాక చిత్రసీమలో మొదట్లో ఎన్నికష్టాలు, అవమానాలు భరించాలో.

చివరికి వేలు సహాయంతో వీరేష్ సినిమాలో ఓ చిన్న పాత్రలో కనిపించాడు. పాత్ర చిన్నదే అయినా అన్నిటికన్నా అధికంగా గుర్తుండిపోయే పాత్ర కావడంతో ఆ చిత్రం హిట్ కావడంతో నెమ్మదిగా రేలంగి నరసింహారావు చిత్రంలో ఇంకొద్ది పెద్ద పాత్రలో కనిపించాడు. తర్వాత రాఘవేంద్రరావు, కోదండరామిరెడ్డి లాంటి పెద్ద డైరెక్టర్ల చిత్రాల్లో కూడా ఛాన్సు దొరికింది.

క్రమంగా వీరేష్ ప్రేక్షకుల్లో మంచి కమెడియన్‌గా గుర్తింపుతెచ్చుకోసాగాడు. మరో రేలంగి, మరో పద్మనాభం, మరో వేలు, మరో బ్రహ్మానందం అనుకోసాగారు ప్రేక్షకులు వీరేష్ గురించి.

బెజవాడ ఏలూరు రోడ్డు ఓ బట్టల షాపులో పనిచేసే వీరేష్ మద్రాస్ వెళ్ళి సినిమాల్లో స్థిరపడ్డాడు. కొద్ది కాలంలోనే మంచి హాస్యనటుడిగా వంశీ బర్కిలీ అవార్డులను కొట్టేయసాగాడు.

క్రమంగా అతని ఫ్యాన్‌మెయిల్ మొదలై అధికం కాసాగింది. వీరేష్‌కి ఫ్యాన్ లెటర్స్ రాసే వాళ్లలో ఎక్కువ శాతం కాలేజీల్లో చదివే టీనేజ్ కుర్రవాళ్ళే. వాళ్ళే మొదటి రోజు సినిమాలకు ఎగబడేది. కాబట్టి వీరేష్ సినిమాలో ఉంటే, అతని ఫాలోయర్స్ కొన్ని వేల మంది తప్పనిసరిగా ఆ చిత్రం చూస్తారన్న సంగతిని నిర్మాతలకు బాగా అర్థమయింది.

దాంతో కథ చర్చ జరుగుతున్నప్పుడే నిర్మాతలు కథకుల్ని వీరేష్‌కు ఏ పాత్ర ఇస్తున్నారు. అని అడగడం రివాజయింది. వీరేష్ కోసం కథలో ప్రత్యేకంగా ఓ పాత్రను సృష్టించసాగారు కథకులు. వీరేష్ పెద్ద పాత్రలో నటిస్తే ఆ సినిమా కొనడానికి ఉత్సాహం చూపసాగారు బయ్యర్స్.

అనేకమంది కామెడీ నటుల జీవితాల్లో జరిగిన అన్ని ఫేజ్‌లూ వీరేష్ కెరీర్‌లో కూడా పునరావృతమయ్యాయి.

*** ***

భట్టిప్రోలు అనే ఓ చిన్నవూరి నుంచి వీరేష్‌కి మాలతి అనే అమ్మాయి లెటర్స్ రాస్తుంటుంది. వీరేష్ చిత్రం విడుదలయిన రెండు వారాల్లో గుంటూరు వెళ్ళి చూసి ఆ చిత్రంలోని వీరేష్ నటన మీద, పాత్ర మీద తన అభిప్రాయాలు తెలియజేస్తుంటుంది.

వీరేష్ ఆమె లెటర్లు శ్రద్ధగా చదివి జవాబు రాస్తుంటాడు. ఎందుకంటే వీరేష్‌కి మొట్టమొదట్లో వచ్చిన నాలుగయిదు ఫ్యాన్ లెటర్స్‌లో మాలతి లెటర్ కూడా ఉంది. అతనికి ఓ అమ్మాయి నుంచి ఫ్యాన్ లెటర్ రావడం కూడా మొదటిసారి కాబట్టి ఎంతో థ్రిల్లింగ్‌గా ఫీలయ్యాడు.



అంతరిక్షంలో అన్నింటికన్నా దూరంగా ప్రయాణించే భారతీయ చిహ్నం ఏమిటి?

ఓస్ అది కూడా తెలియదా! ప్రతి రోజూ పెరుగుతున్న ధరల సూచిక.

లత.
హైదరాబాద్

అమరావతికి షూటింగ్‌కు వెళ్ళాల్సివస్తే మాలతికి ముందుగా తెలియజేశాడు వీరేష్. ఆమె కలవలేదు. విజయవాడ, గుంటూరు, మంగళగిరిలలో షూటింగ్‌కు వెళ్ళినప్పుడు కూడా తెలియజేశాడు. గుంటూరుకు తాను రాలేనని, "మీరే మా ఊరువచ్చి, మా ఆతిథ్యం స్వీకరించండి" అంటూ మాలతి జవాబు రాసింది. దాంతో ఓ రోజు భట్టిప్రోలులోని మాలతి ఇంటికి కారులో వెళ్ళాడు వీరేష్.

మాలతి తండ్రి మోతుబరి రైతు. ఎంతో హుందాగా ఉన్నాడు. వీరేష్‌ని పిల్లకాకిలా చూశాడు. మాలతిని పిలిచి పరిచయం చేస్తాడనుకున్న వీరేష్‌కి ఆశాభంగమే ఎదురయింది. ఎంతకీ పిలవడే! ఏ మనుకుంటున్నాడు నా గురించి? ఇదీ వీరేష్ బాధ.

భోజనాలయ్యాయి.

"ఇంక వెళతాను" చెప్పాడు వీరేష్. ఇవాళ షూటింగ్ లేదన్నావుగా! కాసేపు పడుకోరాదూ! గడ్డపెరుగుకి నిద్ర వస్తుంది. నడుం వాల్చి లేచాక కాఫీ తాగి వెళ్లువుగానీ" చెప్పాడు మాలతి తండ్రి.

"అది కాదండి వెళ్ళాలి" అన్నాడు వీరేష్ అసహనంగా.

"పెద్దవాణ్ణి! చెప్తుంటే నీ క్కాదు. పోయి నడుం వాల్చు" అని గదమాయించాడు మాలతి తండ్రి.

వీరేష్‌కి ఓ పక్క బాధగా ఉంది. ఇంత పెద్ద పాపులర్ కమెడియన్‌ని మరీ ఇలా తేలిగ్గా తీసిపారేస్తాడేమిటి? అనుకున్నాడు. ఆయన అన్నట్టుగానే పడుకోగానే నిద్రవచ్చింది. నిద్ర అయ్యాక బయటికి వచ్చాడు. బయట హాల్లో దాదాపు పదిమంది గ్రామ పెద్దలు కూర్చొని ఉన్నారు.

'నిద్ర బాగా పట్టిందోయ్!' అడిగాడు మాలతి తండ్రి.

కంచు గ్లాసు నిండా కాఫీతో వచ్చాడు. పనివాడు. పెద్దలందరికీ పరిచయం చేస్తూ వాళ్ళు ఎన్ని ఎకరాలకు యజమానులో కూడా చెప్పాడు మాలతి తండ్రి. అంతా తనకన్నా ధనికులే అనుకున్నాడు వీరేష్.

"అమ్మాయిని చూపించండి" పురమాయించాడు ఓ పెద్ద మనిషి.

"మాలతిని రమ్మను" పనిమనిషికి చెప్పాడు మాలతి తండ్రి.

ఆమె నడిచి వస్తుంటే ఝల్లు ఝల్లు మన్నాయి. కాళ్ళు గజ్జెలు. పూల జడ, పట్టుచీర, ఒంటి నిండా నగలు.... అచ్చం పెళ్ళి చూపులకు వచ్చే పల్లెటూరి అమ్మాయిలా ఉంది.

"ఎంత అందగత్తె, నా అభిమానురాలు" అనుకోకుండా ఉండలేకపోయాడు వీరేష్.

'ఏదయినా అడగదల్చుకుంటే అడుగు బాబూ" చెప్పారు పెద్దమనుషులు.

అప్పటికి గానీ వీరేష్‌కి అర్థం కాలేదు మాలతికి, తనకు పెళ్ళి చూపులని. మాలతి కళ్ళెత్తి వీరేష్‌ని చూడలేనంత సిగ్గుపడిపోయింది.

కారెక్కుతుండగా చెప్పారు వీరేష్‌కి పెద్దమనుషులు.

"మాలతికి నువ్వంటే తగని ఇష్టం. ఇలా అభిమానురాలినంటూ పరాయి మగాళ్లను చూడటానికి వెళ్తానంటే పంపే మనిషి గాదు మాలతి తండ్రి. సాంప్రదాయాన్ని గౌరవించే వ్యక్తి. కాబట్టి పెళ్లి చూపుల ద్వారా ఒకరినొకరు చూసుకోవడం భావ్యం అనుకొన్నాడు. నీవు బ్రహ్మచారివి. నీకు మాలతి నచ్చితే మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు. లేదా నీవూ మాలతిని చూశావు. మాలతి నిన్నూ చూసింది కాబట్టి ఇంతటితో సరి.

వీరేష్ కార్లో దార్లో మాలతిని చేసుకోవడం గురించి ఆలోచిస్తుండిపోయాడు. అందుకు అభ్యంతరంగా ఏదీ కనబడలేదు.

ముఖ్యంగా మాలతి తనని అభిమానించే అమ్మాయి.

జరిగినదాన్ని జంధ్యాలకు ఓ రోజు షూటింగ్ సమయంలో వివరించాడు.

"శుభస్యశీఘ్రం" అన్నారాయన.

బ్రహ్మానందంతో ప్రస్తావిస్తే

"ఇంకో ఆలోచనెందుకు కానించెయ్యండి" అని సలహా ఇచ్చాడు. వేలు ముక్కుంపొడుం పీల్చుకుంటూ

"పప్పన్నం త్వరగా పెట్టించవోయ్" అన్నాడు.

రెణ్నెళ్లలో వీరేష్ వెడ్డింగ్ కార్డులు అచ్చయ్యాయి.

పెళ్లయింది.

ప్రేమ పిందుకు వేళయింది.

* * *

సాంప్రదాయం ప్రకారం భట్టిప్రోలులోని మాలతి ఇంట్లో విశాలమయ్యిన గదిలో మూడున్నర అడుగుల ఎత్తు పందిరిపట్టు మంచం మీద తెల్ల లాల్చీ, పంచెలో వెయిట్ చేస్తున్నాడు వీరేష్.

తలుపు తెరుచుకుంది. మాలతి తలవంచుకుని పాలగ్లాసుతో లోపలికి అడుగుపెట్టింది. అమ్మలక్కలు తలుపులు మూసేశారు. బయటనుంచి నవ్వులు వినపడసాగాయి.

వీరేష్ లేచి వెళ్లి మాలతి చేయి పట్టుకున్నాడు. మంచం దగ్గరికి తీసుకొచ్చాడు. ఇద్దరికీ సమానంగా పులకింతగా ఉంది. ఇద్దరికీ అలాంటి సిచ్యుయేషన్ కొత్తకాబట్టి.

"మాలతీ ! నువ్వంటే నా కిష్టం"

"నువ్వన్నా నాకెంతో ఇష్టం" చెప్పింది మాలతి మెల్లిగా.

"ఎందుకని"

"మీ సినిమాలు చూసి ! ఎంత హాయిగా నవ్విస్తారో

మీరు"

దగ్గరికి తీసుకుని మాలతి గడ్డం కింద కుడిచేతి చూపుడు వేలుంచి సున్నితంగా ఆమె తలని పైకెత్తి చెప్పాడు.

ఎందుకంత సిగ్గు కళ్లు తెరు.

కళ్లు తెరిచింది మాలతి. ఆమె మొహంలో సిగ్గు అన్నబోర్డు రాసి పెట్టినంత స్పష్టంగా కనిపిస్తోంది సిగ్గు.

"చూడు"

అతని మొహం వంక చూసింది.

"ఏదీ ఒక్కసారి న..."

ఫక్కున నవ్వింది మాలతి వీరేష్ ఆ వాక్యం పూర్తిచేయకుండానే. నవ్వు ఆవు అనేదాకా నవ్వుతూనే ఉంది.

"ఏమిటంత నవ్వు" అడిగాడు వీరేష్.

రెండు నిముషాల తర్వాత "మిమ్మల్ని చూస్తే నవ్వొస్తోంది" నవ్వుతూ అతనికి చెప్పింది మాలతి. ఇంత కాలం కొన్ని లక్షల మందిని నవ్వించినందుకు వీరేష్ తనని తాను తిట్టుకున్నాడు. "ఆత్మజ్యోతిలో మీరు మీరు చెవిటి వాడిలా నటించారు. ఇంకా "నరదామొగుడు" లో "కాసేపు నవ్వావు.. ఇది నవ్వే సమయం కాదు"

మాలతి బలవంతంగా నవ్వాపుకుంది. మంచం చేరారు. మాలతిని చుంబించడానికి ఆమె మొహం మీదికి వంగగానే మళ్ళీ కిలకిల నవ్వసాగింది మాలతి. వీరేష్ మొహం కనబడ్డప్పుడల్లా వద్దనుకున్నా ఫక్కున నవ్వొచ్చేస్తున్నది మాలతికి.

శోభనం గది గోడల మధ్య ఉండాల్సింది తమకం, ఆతృత, కోరిక తప్ప నవ్వులు కాదు. నవ్వు ఆ మూడిటిని గదిలోంచి బయటికి నెట్టేస్తుంది.

మాలతి నవ్వు ఆపుకోడానికి వీరేష్ మొహం చూడకుండా ఉంది. కానీ వీరేష్ ఆమెను దగ్గరికి తీసుకుంటే అతని మొహం చూడగానే ఆపుకోలేని నవ్వు నవ్వసాగింది. ఆ నవ్వుతో వీరేష్ నీరుగారిపోసాగాడు.

ఆవిధంగా వీరేష్ మొదటి రాత్రి లవ్‌నైట్ కాకుండా "నవ్వు రాత్రి"గా నిలిచిపోయింది.

ఆ తర్వాత మాలతిని హిప్నాటిస్టు బి.వి. పట్టాభిరామ్ దగ్గరికి తీసుకువెళ్లి తన మొహం చూస్తే ఆమెకు నవ్వు రాకుండా ఆమెకు ట్రీట్‌మెంట్ ఇప్పించాడు వీరేష్.

ఆ తర్వాతే సంసారం సజావయింది. అది వేరే కథ.

ఇప్పటికీ వీరేష్ పత్రికల్లో ఔత్సాహిక కమెడియన్లకు మీరిచ్చే సలహా ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానంగా "కమెడియన్ కాక ముందే పెళ్లి చేసుకోండి. లేదా ఓ గొప్ప అనుభవాన్ని మిస్ అవుతుంది" అని చెప్తుంటాడు.



'ఈ వార్త చూడు! అసలు నమ్మశక్యంగా లేదు కదా! మగవాడు ఎంత తెలివి తక్కువ వాడు అయితే అతని భార్య అంత అందగత్తె అవుతుందిట' అన్నాడు భర్త.

"ఎప్పుడూ నన్ను పొగడడమేనా" అంటూ గారాలు పోయిందా ఇల్లాలు.

లత
హైదరాబాద్

# పత్నీమ్ శరణమ్ గచ్ఛామి

ఉపనిషత్-కాలంలో ప్రకాండ పండితుడైన యాజ్ఞవల్క్యుడు గార్గితో తలపడాలంటే జంకేవాడు. గృహస్థాశ్రమాన్ని త్యజించి అడవిలో తపస్సు చేసుకోటానికి తన భార్య అనుమతి కోరిన యాజ్ఞవల్క్యుడు భంగపాటుకు గురికావలసి వచ్చింది. కైకేయి అడిగిన రెండు వరాలతో దశరథ మహారాజు బాధల చక్రవ్యూహంలో పడి పరితపించి ప్రాణత్యాగం చేశాడు. రాజైన భర్తృహరి భార్య నమ్మక ద్రోహం చేస్తే సన్యాసం తీసుకోవలసి వచ్చింది. నరకాన్ని సృష్టించాలన్నా స్వర్గాన్ని అలరింపజేయాలన్నా అందులో స్త్రీ పాత్ర ఎంత వుందో విశద మౌతోంది.

ఒక పర్యాయం తన మిత్రుడి భార్య చనిపోయి నందుకు మహాకవి గాలిబ్ సంబరపడ్డాడు. కొంత బాధ కూడా కలిగింది. ఆయనిలా అన్నారు – కొందరిని అదృష్టవంతులని చెప్పాలి. ఎందుకంటే వారికి త్వరగా భార్యా వియోగం కలుగుతుంది. నాకు యాభై సం॥ లు పైబడుతున్నా ఆ అదృష్టం నన్ను వరించటం లేదు" ఒక రోజు గాలిబ్ తన భార్యతో బాడుగ ఇల్లు చూసి రమ్మని చెప్పాడు. చూసి వచ్చిన తర్వాత భార్యతో "ఎలా వుందని" అడిగాడు " ఇల్లు బాగానే ఉంది కాని, అక్కడొక గయ్యాళి ఉంటోంది." "నీ కంటేనా?" అన్నాడు గాలిబ్. తర్వాత ఎంత ప్రాధేయ పడినా ఆ ఇంటిలో చేరటానికి గాలిబ్ సతీమణి ససేమిరా ఒప్పుకోలేదు.

మహారచయిత టాల్‌స్టాయ్ భార్య గయ్యాళి అని పేరు తెచ్చుకుంది. ఆమె దగ్గర ఎప్పటికప్పుడు రెడీమేడ్ జవాబులుండేవి. ఒక పర్యాయం టాల్‌స్టాయ్ గారు ఓ కొత్త నవల ప్రారంభించారు. భార్య కప్పులో టీ తీసుకొని వచ్చింది. "అక్కడ పెట్టి వెళ్ళు డియర్ నాలుగైదు వాక్యాలు పూర్తిచేసుకొని త్రాగుతాను."

"లేదు, వెంటనే త్రాగా" లంది భార్య.

"మేజా మీద ఉంచి వెళ్ళు. కొద్దిసేపయాక త్రాగు" తా నన్నాడు టాల్‌స్టాయ్. దీనితో కోప్పడిన ధర్మపత్ని ఆ టీని ఆయన తలమీద పోసి వెళ్ళి పోయింది.

"నాకు తెలును, ఉరుములు, మెరుపులు వినిపిస్తున్నాయి. వర్షం తప్పకుండా కురుస్తుందని కూడా అనుకున్నాను" అన్నారు.

కంటి చూపును పోగొట్టుకున్న తర్వాత మహాకవి మిల్టన్ ఒక అందమైన అమ్మాయితో పెండ్లి చేసుకున్నాడు. తను అందంగా ఉన్నానన్న అహంభావం, గయ్యాళీ తనంతో ఆ సుందరి భర్త మీద వ్యంగ్య బాణాలు సంధించేది. గాయ పడిన మిల్టన్ పెళ్ళి చేసుకుని తాను చాలా తెలివి తక్కువ పనిచేశానని చింతించాడు. ఒక రోజు ఓ స్నేహితుడు మిల్టన్ తో ఇలా అన్నాడు – "మిల్టన్! నీ శ్రీమతి గులాబీ పువ్వులా ఉందిసుమా!"

"ఉండొచ్చు, రంగు, రూపము నేను ఎలాగు చూడలేను - కాని ముళ్ళు మాత్రం తప్పనిసరిగా గుచ్చుకుంటూ ఉంటాయి," అన్నాడు మిల్టన్ దిగాలుగా.

రేడియోను కని పెట్టిన సుప్రసిద్ధ వైజ్ఞానికుడు ఎడిసన్ ఒక విందులో పాల్గొన్నాడు. గొప్పింటి ఆడవారు ఆవిందులో ఎక్కువగా అగుపించారు. వారు ఎడిసన్‌ను ఇతరులకు పరిచయం చేస్తూ సభలో తమకు తోచిన నాలుగు సుత్తి వాక్యాలు అప్పజెప్పారు. ఎడిసన్ వంతు వచ్చింది.

"నేను మాట్లాడే యంత్రాన్ని కనుగొన్న మాట వాస్తవమే గానీ, నాకంటే ముందు ప్రకృతే అలాంటి యంత్రాన్ని ఎప్పుడో కనిపెట్టింది. నేను కనిపెట్టిన మాట్లాడే యంత్రాన్ని ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు నోరు మూయించ వచ్చు. కానీ ప్రకృతి తయారు చేసినదిమాత్రం ఒక్కసారి నోరు విప్పితే మళ్ళీ మూసుకొనే పని ఉండదు. ప్రకృతి తయారుచేసిన ఆయంత్రం పేరే - భార్య.

కొందరి భార్యల మానసిక పరిస్థితి బహు చిత్రంగా ఉంటుంది. – ఒకమారు బ్రిటన్‌లోని ఓ మధ్యవయస్కు రాలైన వనిత విసుగొచ్చి పత్రికల్లో ఇలా ప్రకటించింది. – "సరసమైన ధరకు ఓ భర్త అమ్మకానికి సిద్ధంగా ఉన్నాడు. కొనుగోలు చేయువారు ఫలానా చిరునామాకు సంప్రదించండి." అలా పత్రికల్లో ప్రకటన ఇచ్చిన ఆ వనిత పేరు లూసీ – హర్నర్, ఇథోపియాకు చెందిన మరో విధవరాలు ఓ పిచ్చెక్కిన గుర్రాన్ని చూసి చాలా సంబరపడింది. ఆ గుర్రాన్ని పోషిస్తున్న సంస్థకు తన సంపదనంతా ఆ వనిత దానం చేసింది. ఎందుకో తెలుసా? ఆ పిచ్చి గుర్రం డెక్కల చేత త్రొక్కబడి చంపబడ్డాడు.

ప్రపంచ ప్రసిద్ధ తాత్విక వేత్త సుకరాత్ పేరు మీరు వినే ఉంటారు. ఆయన అందగాడు కాడు. కాని సుకరాత్ భార్య చాలా గయ్యాళి. భర్త మీద చెయ్యి చేసుకోవడంలో ఆమె దిట్ట. సుకరాత్‌కు స్వాగతం పలికేందుకు ఆమె చీపుర్లు, పాడైపోయిన కోడి గ్రుడ్లు, టమోటాలను ఉపయోగించేదట. కానీసుకరాత్ ఓ విచిత్ర మైన జీవి. వాటన్నిటినీ అంత పట్టించుకునే వాడు కాదు. పతివ్రతగా ప్రసిద్ధి కెక్కిన ఆ సతీమణి తన భర్త మీద కోపం వచ్చినపుడు ఒక బకెట్ నిండా నీరు నింపుకుని ఆయన మీద గుమ్మరించేది. అప్పటి శాసకులు ఆయనను విషంత్రాగించి చంపాలని నిశ్చయించారు. సంతోషంతో సుకరాత్ ఆ విషాన్ని త్రాగి దేహం చాలించాడట! ఇలాంటి బాధలు ఎంతకాలమని భరించగలడు? టాల్‌స్టాయ్ తెలివైనవాడు కాబట్టి భార్య క్రోధాగ్నికి బలి కాకముందే ఇంటినుండి జారుకున్నాడు.

డాక్టర్. సి.వి.కె.